సాక్షి

మెదక్

సోమవారం। 1। జనవరి। 2024



కొంగొత్త ఆశలు..

"2023కి ముగింపు పలికి 2024 సంవత్సరంలోకి ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో అడుగుపెట్టేశాం". వివరాలు 8లో ▸



పామాయిల్, జామ తోటలు దహనం

గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారు 30 ఎకరాల పామాయిల్, జామ తోటలు దహనమయ్యాయి. వివరాలు 8లో ▸



మలుపులు మృత్యువుకు పిలుపులు

మలుపులు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వివరాలు 9లో ▸

ప్రభుత్వాసుపత్రుల బలోపేతం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కొత్త సంవత్సరంలో ప్రభుత్వాసుపత్రులను మరింత బలోపేతం చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం. ఇప్పటికే ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద అందించే వైద్య సాయాన్ని రూ.పది లక్షలకు పెంచింది. తద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందనున్నాయి. పీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల్లో వైద్య సేవలను విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకుంటా. ప్రజాపాలన కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఆరు గ్యారంటీలు అర్హులందరికీ అందేలా చూస్తాం . జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తున్న. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– వైద్యారోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ

పథకాల అమలుకు ప్రాధాన్యం



మెదక్ కలెక్టరేట్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలైన ఆరు గ్యారంటీలకు నూతన సంవత్సరంలో మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహిళలకు మహాలక్ష్మి ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలవుతోంది. మిగతా 5 గ్యారంటీలకు సంబంధించి మూడు రోజులుగా పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో వార్డుల వారీగా ప్రజాపాలన వేదికలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇప్పటి వరకు 73,885 దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. జనవరి 6 వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– కలెక్టర్ రాజర్షిషా

మరిన్ని ప్రణాళికలను రూపొందించుకుంటాం



మెదక్ మున్సిపాలిటీ: నిత్యం సవాళ్లతో కూడుకున్న పోలీసు వృత్తిలో ఏరోజుకారోజు కొత్తదనం ఉంటుంది. ప్రజల సంతోషాలే మనకు ముఖ్యం. 2023 లో మనం సాధించిన ప్రగతిని బేరీజు వేసుకుని మరింత ఉత్సాహంగా పని చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటాం. ప్రజలు పోలీసు శాఖ పట్ల స్నేహపూర్వకంగా ఉండటం ఎంతో సంతోషకరం. శాంతిభద్రతల పరిరక్షణలో గతే దాది సిబ్బంది చేసిన కృషి అభినందనీయం. పాలనలోని లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తాం. పోలీసు సిబ్బంది, కుటుంబాలు, ప్రజలు ఆనందంగా ఉండాలి. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– అదనపు ఎస్పీ మహేందర్

న్యూస్‌రీల్

జిల్లాలో పోలీసు యాక్ట్ అమలు

ఇన్‌చార్జి ఎస్పీ సింధు



మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని జనవరి 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సింధు శర్మ ఆదివారం తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. అలాగే ప్రజాధనాన్ని నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. ఈ విషయంలో జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.

అశోక్‌కుమార్‌కు డాక్టరేట్



అశోక్‌కుమార్‌కు మెమొంటో, సర్టిఫికెట్‌ను అందజేస్తున్న యూనివర్శిటీ ప్రతినిధులు

నర్సాపూర్: పట్టణంలోని ప్రైవేట్ కాలేజీల నిర్వాహకుడు నల్లగండ్ల అశోక్ కుమార్‌కు ఓ విద్యా సంస్థ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎడ్యుకేషన్, సోషల్ సర్వీస్ విభాగంలో తమిళనాడు రాష్ట్రం హుసూర్‌లో ఉన్న ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చి యూనివర్శిటీ శనివారం డాక్టరేట్ అందజేసింది. ఆయనకు సర్టిఫికెట్, మెమొంటోను వర్శిటీ ప్రతినిధులు అందజేశారు. తనకు డాక్టరేట్ రావడం పట్ల అశోక్ సంతోషం వ్యక్తం చేశారు.

ఉద్గిర్ మల్లయోధుల హవా



కోహీర్‌లో కుస్తీ పడుతున్న పహిల్వాన్‌లు

కోహీర్(జహీరాబాద్): పట్టణంలోని మౌలానా మోహిజొద్దీన్ దర్గా మైదానంలో ఆదివారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. స్థానిక మల్లయోధులతో పాటు హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చి ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉద్గిర్ మల్లయోధులు అత్యధిక పోటీలలో విజయం సాధించి చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. ఉద్గీర్ క్రీడాకారిణి శ్వేత(13) రెండు పోటీలలో బాలురతో పోటీ పడి విజయం సాధించారు. ఆఖరి పోటీలో ఉద్గిర్ పహిల్వాన్ ప్రసాద్ కర్ణాటక పహిల్వాన్ సిద్దును చిత్తు చేసి చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు.

హ్యాపీ న్యూఇయర్



నూతన సంవత్సరం 2024 అంకెలను ప్రదర్శిస్తున్న బాలికలు



ప్రార్థనల్లో భక్తులు, (ఇన్‌సెట్లో) ప్రెస్బిటరీ ఇన్‌చార్జి శాంతయ్య

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని చర్చిల వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచి క్రైస్తవులు ప్రార్థనలు చేయనున్నారు. భక్తులు రానున్న దృష్ట్యా మౌలిక సదుపాయాలను కల్పించారు. మెదక్‌లోని ప్రముఖ సీఎస్ఐ చర్చి విద్యుత్ కాంతులతో జిగేల్ మంటుంది. ఇక్కడకు జిల్లాలోని ప్రజలు, తెలుగు రాష్ట్రాలు, పొరుగు రాష్ట్రాల యాత్రికులు సైతం వస్తుంటారు. దీంతో ఈ ప్రాంతమంతా సందడిగా కనిపించనుంది. కాగా, మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చర్చి ప్రెస్బిటరీ ఇన్‌చార్జి శాంతయ్య ప్రార్థనలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. సిలువ ప్రాంగణం వద్ద టెంకాయలు కొట్టి, క్యాండిల్స్ వెలిగించి మొక్కులు చెల్లించారు. - మెదక్

ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నితాకాయి. 2023కు వీడ్కోలు.. 2024కి స్వాగతం అంటూ జిల్లా ప్రజలు నూతన సంవత్సరానికి ఆదివారం అర్ధరాత్రి వేళ కేకులు కట్ చేసి ఆత్మీయ స్వాగతం పలికారు. కొత్త ఏడాదిలో అందరికీ శుభాలు జరగాలని కోరుకున్నారు. విందులు, వినోదాలతో జిల్లా అంతటా సందడి నెలకొంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని యువకులు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. గ్రామాల్లోనూ ప్రజలు సమూహాలుగా ఏర్పడి విందులు చేసుకున్నారు. స్థానిక బేకరీలలో పెద్ద ఎత్తున కేకులను కొనుగోలు చేశారు. అలాగే ఇంటిముందు ముగ్గులు వేయడానికి మహిళలు రంగులను కొనుగోలు చేశారు. మరోవైపు నూతన సంవత్సర వేళ దేవాలయాలను శోభాయమానంగా అలంకరించారు. భక్తుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. - ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



సిద్దిపేటలోని బేకరీలో రద్దీ



ఏడుపాయల కిటకిట

ఏడుపాయల దుర్గమ్మ నిలయం ఆదివారం జనసంద్రంగా మారింది. 2023 సంవత్సరం చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల వచ్చిన యాత్రికులు మంజీర నదిలో స్నానాలు చేసి, బారులు తీరి వన దుర్గను దర్శించుకున్నారు. పూజారులు శంకరశర్మ, పార్థివ శర్మ అమ్మవారికి పూజలు చేశారు. భక్తులు దుర్గమ్మకు మొక్కులు తీర్చారు. పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

- పాపన్నపేట (మెదక్)

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి, ఎస్‌బీఐ మేనేజర్ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఆదివారం కౌడిపల్లి మండలం వెంకటాపూర్(ఆర్), వెంకట్రావుపేట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు కేంద్ర ప్రభుత్వం పంటల సాగు కోసం వ్యవసాయ రుణాలు, స్వయం ఉపాధి కోసం ముద్ర రుణాలు ఇస్తోందన్నారు. దీంతోపాటు పీఎం సురక్ష యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు పెట్టుబడి సహాయం అందజేస్తోందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ రైతులు సేంద్రియ సాగు చేయాలని తెలిపారు. దీంతోపాటు ఉపాధి హామీ, వ్యవసాయం, ఐకేపీ, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్‌గుప్తా, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, రాకేష్ వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌కు వన్నె తెస్తా

- అన్ని గ్రామాలకు రోడ్లు, రవాణా సౌకర్యం
- గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులు పూర్తిచేస్తా
- మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్: గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులను పూర్తిచేయించి రైతులకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆయన సాక్షితో మాట్లాడారు. హుస్నాబాద్ అంటే ఒక గౌరవాన్ని కల్పించి, అధికారులు స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేస్తానన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామానికి పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రహదారులను నిర్మించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తామన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. ధర్మసాగర్ వద్ద ఎత్తు పెంచి దేవాదుల ప్రాజెక్టు ద్వారా భీమదేవరపల్లికి, అలాగే కాకతీయ కాలువల ద్వారా ఎల్కతుర్తి మండలాలకు సాగునీరందించేలా చొరవ తీసుకుంటానన్నారు.

ఆలయాల అభివృద్ధి..

కొత్తకొండ, సుందరగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయం, హుస్నాబాద్ శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయాలను అభివృద్ధి చేయించేలా చర్యలు తీసుకుంటానని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. అలాగే ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం కోసం మొదటి ప్రాధాన్యత ఇచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. హుస్నాబాద్‌ను బలవంతంగా సిద్దిపేటలో విలీనం చేశారని, ప్రజల అభిప్రాయం మేరకు కరీంనగర్ జిల్లాలో కలిపేందుకు నిర్ణయం తీసుకుంటానని అన్నారు.

ఉద్యోగాల సాధనలో..

కొత్త ఏడాదిపై యువత కొంగొత్త ఆశలు

ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న యువత కొత్త ఏడాదిపైనే కోటి ఆశలు పెట్టుకుంది. వాటి కోసం నిరంతరం పుస్తకాలతో కుస్తీ పడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం మెగా డీఎస్సీని వేస్తామని ప్రకటించడంతో మరింత ఉత్సాహంతో చదువుతున్నారు. కొంతమంది యువతీ యువకులు కొత్త సంవత్సరంలో సాధించాలనుకుంటున్న తమ లక్ష్యాలు తెలిపారు.

– మెదక్ కలెక్టరేట్

సెంట్రల్ బ్యాంకు ఉద్యోగం సాధిస్తా



కేంద్ర ప్రభుత్వ పరిధిలో బ్యాంకు ఉద్యోగం సాధించడమే లక్ష్యం. నేను బీఎస్సీ పూర్తి చేశా. బ్యాంకు ఉద్యోగం కోసం సిద్ధమవుతున్నా. కొత్త ఏడాదిలో ఒక లక్ష్యం పెట్టుకొని చదువుతున్నా.

- సతీష్, యూసుఫ్‌పేట, పాపన్నపేట

సైన్యంలో చేరాలి



నేను మూడేళ్ల క్రితం ఇంటర్ పూర్తి చేశా. పారా మిలిటరీ కోసం ప్రిపేర్ అవుతున్నా. సైన్యంలో చేరి దేశానికి సేవ అందించాలన్నదే నా లక్ష్యం. దీని కోసం ఎంత కష్టపడటానికైనా సిద్ధం

- నవీన్, మక్తభూపతిపూర్, మెదక్

గ్రూప్స్ సాధించడమే లక్ష్యం



గ్రూప్స్‌లో ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం. నేను ఎంఎస్‌సీ (మ్యాథ్స్) పూర్తి చేశా. గ్రూప్స్‌నకు ప్రిపేర్ అవుతున్నా. కానీ గత ప్రభుత్వం నిరుద్యోగులను అనేక ఇబ్బందులకు గురి చేసింది. వచ్చే ఏడాదిపైనే ఆశలన్నీ పెట్టుకున్నా. తప్పకుండా గ్రూప్స్‌లో జాబ్ సాధిస్తా.

-రిత్విక, మెదక్

టీచర్ జాబ్ సాధిస్తా



డైట్ పూర్తి చేసి రెండేళ్ళవుతోంది. గత ప్రభుత్వం తక్కువ పోస్టులతో డీఎస్సీ వేయడంతో ఉద్యోగం సాధించలేక పోయా. కొత్త ఏడాదిలో కచ్చితంగా టీచర్ జాబ్ సాధించే లక్ష్యంతో ప్రిపేర్ అవుతున్నా.

-శ్రీకాంత్, గుట్టకిందిపల్లి, మెదక్

ఫుల్ కిక్కు!

డిసెంబర్ నెల చివరి మూడు రోజుల్లో మద్యం విక్రయాలు రూ.11.51 కోట్లు



కొల్చారం(నర్సాపూర్): మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. దీంతో ఆబ్కారీ శాఖకు భారీ ఆదాయం చేకూరింది. 2023 సంవత్సరానికి బైబై చెబుతూ 2024కు స్వాగతం పలుకుతూ మద్యంప్రియులు పార్టీలు చేసుకుంటున్నారు. ఏడాది చివరి రోజు ఆదివారం కావడంతో జరుపుకొనే పార్టీల్లో మద్యం తప్పనిసరి. దీంతో ఈ విక్రయాలు జోరుగా సాగాయి. మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నఘనాపూర్ శివారులోని ఇండియన్ మేడ్ లిక్కర్ (మద్యం ఆధారిత నిల్వ కేంద్రం) పరిధిలో 118 మద్యం దుకాణాలు, 15 బార్లు ఉన్నాయి. డిసెంబర్ నెల చివరి మూడు రోజులు రూ.11.51 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో ఇండియన్ మేడ్ లిక్కర్ 22,291 కేసులు, బీరు 22, 768 కేసులు అమ్ముడయ్యాయి.

క్లుప్తంగా

తెలంగాణ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ అవార్డు అందజేత



శివకుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్‌: నారాయణఖేడ్‌ మండలం అనంతసాగర్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్‌ తెలంగాణ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ అవార్డును అందుకున్నారు. 20 నెలల కాలంలో వేయి రావి ఆకులపై సందర్భాలను బట్టి వినూత్నంగా చిత్రాలను మలచినందుకు, గీసినందుకు తెలంగాణ బుక్‌ ఆఫ్‌రికార్డ్స్‌లో ఫౌండర్‌ కె.ఎల్లేష్‌కుమార్‌ చోటును కల్పించారు. ఈ మేరకు ఆయన పంపిన అవార్డు తోపాటు ధృవపత్రం, జ్ఞాపిక, మెడల్‌, బ్యాడ్జీలను ఆదివారం ఖేడ్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి చేతులమీదుగా అందజేసి శాలువాతో సన్మానించారు. ఇలాంటి అవార్డులు మరిన్ని సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి ఖేడ్‌ ప్రాంతానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ దారం శంకర్‌, బంజారా సేవాలాల్‌ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌, చౌహాన్‌, పరమేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



మద్యం చూపుతున్న ఎక్సైజ్‌ పోలీసులు

జహీరాబాద్‌: అక్రమంగా దాచి ఉంచిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్‌ పోలీసులు పట్టుకున్నారు. శనివారం మండలంలోని దిడిగి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో బోయిని నాగేందర్‌కు చెందిన ఇంటిలో అక్రమంగా నిల్వ ఉన్న 17 మద్యం బాటిళ్లు, కర్ణాటకకు చెందిన 1.53 లీటర్ల లిక్కర్‌ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అశోక్‌కుమార్‌ పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

కేతకీ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాట్లు



సంగమేశ్వర ఆలయంలో పార్వతీపరమేశ్వరులు

ఝరాసంగం (జహీరాబాద్‌): ఉమ్మడి మెదక్‌ జిల్లాలోని అతిపెద్ద శివాలయంగా పేరుగాంచిన కేతకీ క్షేత్రంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయ అర్చకులు ప్రాతః కాల పూజ అనంతరం భక్తులకు దర్శనం సౌకర్యం కల్పించనున్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగే అవకాశం ఉంది కనుక అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆలయ ఈఓ శశిధర్‌ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం



గోస్వామి (ఫైల్‌)

జిన్నారం(పటాన్‌చెరు): ఐదు నెలలుగా ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నయీముద్దీన్‌ కథనం ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని పుసినాఘర్‌ జిల్లా, షాకువలీ గ్రామానికి చెందిన బ్రిజేష్‌ గోస్వామి బొల్లారంలోని మల్లన్న బస్తీలో నివాసం ఉంటూ ఓ పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. నెల రోజుల నుంచి గోస్వామి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు స్నేహితుల వద్ద సమాచారం కోసం వెతికిని ఫలితం లేకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

కొంగొత్త ఆశలు.. కొత్త ఆశయాలు

- నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం
- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ఎదురుచూపు
- ఆగిపోయిన పనులు, నిలిచిపోయిన నిధులు
- ఇచ్చిన హామీలు అమలు అయ్యేనా!
- కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలపైనే ఆశలన్నీ

కాలగమనంలోకి కొత్త సంవత్సరం వచ్చేసింది. 2023కి ముగింపు పలికి 2024 సంవత్సరంలోకి ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో అడుగుపెట్టేశాం. ప్రతీ ఒక్కరూ కొత్తగా మార్పు కావాలని కోరుకుంటున్నారు. అలాగే, అభివృద్ధి సైతం జరగాలని ఆశిస్తున్నారు. ఈసారి కొత్త సర్కారు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. రూ.కోట్ల ప్రజాధనంతో మధ్యలో ఆగిపోయిన పనులు, ఇంకా ప్రారంభించని పనులు, ప్రారంభోత్సవాలు జరిగితే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, ఆగిపోయిన పనులను పరుగులు పెట్టించాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని కోరుకుంటున్నారు. తన నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నారో వారి మాటల్లోనే...



దంప్‌యార్డు పరిష్కారానికి కృషి



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణానికి సంబంధించి పరిష్కారానికి నోచుకోని డంప్‌యార్డు సమస్యను పరిష్కరించేందుకు ఈ నూతన సంవత్సరంలో కృషి చేస్తా. ఇందుకు అవసరమైన భూసేకరణ, ప్రత్యేకంగా నిధులు మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. ఈ కొత్త సంవత్సరంలో ఈ అంశానికే తొలి ప్రాధాన్యత ఇస్తాను. అలాగే పట్టణవాసులకు అహ్లాదకరాన్ని పంచేందుకు మహబూబ్‌సాగర్‌ సుందరీకరణ పనులను చేపట్టేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తాను. అవసరమైతే పర్యాటక శాఖ నుంచి నిధులు కేటాయించాలని కోరుతాను. మరో వైపు మెట్రోరైలును సంగారెడ్డి వరకు పొడిగించే ప్రాజెక్ట్‌ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తాను.

–చింతా ప్రభాకర్‌, సంగారెడ్డి ఎమ్మెల్యే

రెవెన్యూ డివిజన్‌, రింగ్‌ రోడ్డు సాధిస్తాం



దుబ్బాకటౌన్‌: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన దుబ్బాక రెవెన్యూ డివిజన్‌, రింగ్‌ రోడ్డు, దుబ్బాక పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణ, దుబ్బాక–హబ్షీపూర్‌ ఫోర్‌ లైన్‌ రోడ్డు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాను. చేగుంట, దౌల్తాబాద్‌ల్లో డిగ్రీ కళాశాలలు, మల్లన్నసాగర్‌ కాలువల నిర్మాణం పూర్తి చేయిస్తా. ఎంపీగా 10 ఏళ్లలో తాను పార్లమెంట్‌ పరిధిలో వందలాది కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేశా. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా నిధులు తీసుకొచ్చి ఇచ్చిన హామీలు పూర్తి చేయడంతో పాటుగా కొత్త పనులు సైతం పూర్తి చేస్తా.

–కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే

సొంత భవనాలు నిర్మిస్తాను



నర్సాపూర్‌: రాబోయే కొత్త సంవత్సరంలో నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాను. ఉస్మానియా యూనివర్శిటీ పీజీ కాలేజీకి సొంత భవనం, అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భవనాన్ని పూర్తి చేయడంతోపాటు నియోజకవర్గంలో సొంత భవనాలు లేని ఆయా సామాజిక వర్గాల గురుకులాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, పలు ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించేందుకు ఆయా శాఖల అధికారులతో సమీక్షించి నిర్మిస్తాను. జిల్లాను సిరిసిల్ల జోన్‌ నుంచి చార్మినార్‌ జోన్‌లో కలపాలని ప్రజల అభీష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను.

–సునీతారెడ్డి, నర్సాపూర్‌ ఎమ్మెల్యే

యువత కోసం ప్రత్యేక ప్రణాళిక



మెదక్‌: ఈ నూతన సంవత్సరంలో ముందుగా యువత భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టిసారిస్తా. మెదక్‌లో యువత డ్రగ్స్‌, గంజాయిలాంటి మత్తుపదార్థాలకు కొందరు బానిసలై వారి జీవితాలు చిన్నాభిన్నమైనట్లు తన దృష్టికి వచ్చింది. ఇలాంటి మత్తుపదార్థాలు విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపి యువకులను సన్మార్గంలో నడిపే విధంగా చర్యలు చేపడుతాం. ఈ విషయంపై ఇప్పటికే అధికారులను సైతం అప్రమత్తం చేశాం. అలాగే, మెదక్‌ అభివృద్ధి విషయంలోనూ రాజీపడకుండా ఇచ్చిన ప్రతీ హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తాం.

–మైనంపల్లి రోహిత్‌రావు, మెదక్‌ ఎమ్మెల్యే

పంట కాల్వలు పూర్తి చేస్తాం



చేర్యాల(సిద్దిపేట): నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తికాని కాల్వలను పూర్తి చేసి సాగు నీరు అందిస్తాం. చేర్యాల రెవెన్యూ డివిజన్‌ సాధన కృషి చేస్తాను. జనగామ, చేర్యాల పట్టణాల అభివృద్ధి, నియోజకవర్గంలోని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న, కావాల్సిన అభివృద్ధి పనులు చేపడుతాం. జనగామ పట్టణ ప్రజలు తాగునీరు కొనుగోలు చేసుకొని తాగుతున్నారు. ఆ పరిస్థితి నుంచి విముక్తి కలిగించేందుకు కృషి చేస్తాను. వీటితోపాటు అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాను.

– పల్లా రాజేశ్వర్‌రెడ్డి,జనగామ ఎమ్మెల్యే

ఆదర్శ నియోజకవర్గమే లక్ష్యం..



పాత సంవత్సర ప్రగతి స్ఫూర్తితో కొత్త ఏడాదిలో ఆదర్శ నియోజకవర్గ లక్ష్యంగా పనిచేస్తాం. అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తాం. పెండింగ్‌ పనులు ఉంటే పూర్తి చేస్తాం. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పటికీ ప్రజల పక్షమే.. నూతన సంవత్సరం నియోజకవర్గ ప్రజలకు అన్ని శుభాలు కల్గించాలని ఆకాంక్షిస్తున్నా. నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– తన్నీరు హరీశ్‌ రావు, సిద్దిపేట ఎమ్మెల్యే

విద్య, వైద్యం సమస్యలు పరిష్కారం



నారాయణఖేడ్‌: నియోజకవర్గంలో విద్య, వైద్యం, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తాను. నూతన సంవత్సరంలో తన ప్రాధాన్యత అంశాలపై శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. విద్య, వైద్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉంది. నిరుద్యోగులకు ప్రభుత్వ, ప్రైవేట్‌ రంగాల్లో వారివారి ప్రతిభల ఆధారంగా ఉద్యోగాలు పొందేలా కృషి చేస్తాను. గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తూ సంక్షేమ పథకాలు సమన్యాయంగా అందించేందుకు తన వంతు కృషి చేస్తాను.

–సంజీవరెడ్డి, నారాయణఖేడ్‌ ఎమ్మెల్యే

పెండింగ్‌ పనులు పూర్తి చేస్తా



జహీరాబాద్‌ తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పెండింగ్‌ పనులను పూర్తి చేయించేందుకు కొత్త సంవత్సరంలో ప్రాధాన్యత ఇస్తాను. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీ పనులను పూర్తి చేయించేలా చూస్తా. నిమ్జ్‌ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా పాటుపడుతాను. నీటి పారుదల ప్రాజెక్టు పనులను మరింత వేగం పెంచేలా ప్రయత్నించనున్నాను. అంతే కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తాను. సంక్షేమ పథకాలు అర్హులందరికీ దక్కేలా పాటుపడతాను.

– మాణిక్‌రావు, జహీరాబాద్‌ ఎమ్మెల్యే

క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత



పటాన్‌చెరు: కొత్త ఏడాదిలో విద్యా, వైద్యం క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాను. నియోజకవర్గంలో క్రీడలు అభివృద్ధి కోసం ఇప్పటికే క్రీడా మైదానాలను ఏర్పాటు చేశాం. మినీ స్టేడియంలో నిర్మాణం పూర్తి చేస్తాం. అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్య తీసుకుంటాను. నియోజకవర్గంలో కొత్త పీహెచ్‌సీలు ఏర్పాటు, ఇతర వైద్య సౌకర్యాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తా. పటాచెరు పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ ప్రక్రియ కొనసాగుతుంది.

– మహిపాల్‌ రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే

ఇండోర్‌ స్టేడియం ఏర్పాటుకు కృషి



బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ బాధ్యులతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్‌: నారాయణఖేడ్‌లో ఇండోర్‌ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్‌ పట్లోళ్ల సంజీవరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ బాధ్యులు, సభ్యులు, క్రీడాకారులు ఆదివారం ఎమ్మెల్యేను ఆయన స్వగృహం వద్ద కలిసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తానూ క్రీడాకారుడేనని, స్టేడియం లేకున్నా రాష్ట్రస్థాయికి అనేక మంది క్రీడాకారులు ఎంపికవ్వడం హర్షణీయమన్నారు. బ్యాడ్మింటన్‌లో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఖేడ్‌ క్రీడాకారులు మైథిలి, రుత్విజ్‌, గంభీర్‌లను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. పీఈటీల అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు మారుతి, ఖేడ్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌ సాజిద్‌, రవికుమార్‌, ఇతర బాధ్యులు భూమయ్య, ప్రవీణ్‌, రవియాదవ్‌ పాల్గొన్నారు.

బావిలో దూకి ఇద్దరు ఆత్మహత్య

- మహిళ మృతదేహం లభ్యం, మరొకరి కోసం గాలింపు
- జహీరాబాద్‌ మండలం కాశీంపూర్‌ గ్రామంలో తీవ్ర విషాదం



మహాదేవి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

జహీరాబాద్‌ టౌన్‌: ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో మహిళ మృతదేహం లభ్యం కాగా, మరొకరి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన జహీరాబాద్‌ మండలంలోని కాశీంపూర్‌ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ.నరేశ్‌, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తమ్మళి మహాదేవి(35), భర్త శేఖర్‌ మద్యానికి బానిసయ్యాడు. ఎకరం పొలం అమ్మగా వచ్చిన డబ్బుతో ప్రతి రోజూ తాగేవాడు. దీంతో ఆరోగ్యం దెబ్బతింది. జీవితంపై విరక్తి చెందిన శేఖర్‌ రెండు నెలల క్రితం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి మహాదేవి డిప్రెషన్‌లోకి వెళ్లింది. మనోవేదనకు గురై నిత్యం బాధపడుతున్న ఆమె ఆదివారం గ్రామ శివారులోని ఎల్లమ్మ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు శవాన్ని బావిలో నుంచి తీసి జహీరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి అత్త మామ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తాగుడుకు బానిసై..

ఇదే గ్రామానికి చెందిన ఆలిగే నర్సింలు(44) తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో నిత్యం గొడవపడేవాడు. వారం రోజుల నుంచి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని అంటుండేవాడు. ఆదివారం ఉదయం భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతుకుతుండగా గ్రామ శివారులోని సత్వార్‌ వ్యవసాయ బావి వద్ద బట్టలు, చెప్పులు కనిపించాయి. వీటి ఆధారంగా ఆత్మహత్య చేసుకున్నాడని భావించి భార్య నాగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ నరేశ్‌, అగ్నిమాపక సిబ్బందితో కలిసి వెతికినా దొరకలేదు. బావిలో నిండుగా నీరు ఉండడంతో రెండు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌ కాలనీకి చెందిన మల్లేశం (44) జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్ట్‌ కార్మికుడిగా పనిచేస్తూ బీహెచ్‌ఈఎల్‌లో గార్డెన్‌ వర్క్‌ చేస్తున్నాడు. నిత్యం మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. డబ్బులు ఇవ్వకుంటే ఉరి వేసుకొని చనిపోతానని బెదిరించేవాడు. శనివారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటికొచ్చి చీరతో ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసి మల్లేశ్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కారు, బైక్‌ ఢీ : కార్మికుడి మృతి

కొడిపల్లి(నర్సాపూర్‌): కారు, బైక్‌ ఢీకొనడంతో సెంట్రింగ్‌ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన కొడిపల్లి మండలం అంతారం గేట్‌ సమీపంలోని వైకుంఠదామం వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌ మండలం రాంచంద్రాపూర్‌ గ్రామానికి చెందిన బుడ్డ క్రిష్ణ (33) సెంట్రింగ్‌ మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌పై వస్తుండగా మెదక్‌ నుంచి వస్తున్న కారు ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో క్రిష్ణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య స్వరూప, కొడుకు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గజ్వేల్‌రూరల్‌: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని అక్కారం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్కూక్‌ మండలం నర్సన్నపేటకు చెందిన సందీప్‌ బైక్‌పై ప్రజ్ఞాపూర్‌ వైపు వస్తున్నాడు. అక్కారం శివారులోకి రాగానే ప్రజ్ఞాపూర్‌ నుంచి జగదేవ్‌పూర్‌ వైపు వెళ్తున్న ఓ కారు సందీప్‌ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడి కాలు విరిగింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది శ్రీకాంత్‌, గణేశ్‌ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు



ధ్వంసమైన కారు, ఆటో

కొల్చారం(నర్సాపూర్‌): మండల కేంద్రం కొల్చారంలోని జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలి వద్ద కారు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం గ్రామానికి చెందిన గౌస్‌ఖాన్‌ ఆటోతో ఊరులో నుంచి మెదక్‌ వైపు వెళ్తుండగా నర్సాపూర్‌ నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గౌస్‌ఖాన్‌కు గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం మెదక్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లగేజీ పేరుతో అక్రమ వసూలు

పట్టించుకోని ఆలయ అధికారులు



లగేజీ భద్రపరుస్తున్న ప్రైవేట్‌ వ్యక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ రాజగోపురం ఎదుట భక్తుల వద్ద లగేజీ పేరుతో కొంత మంది అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆలయ అధికారుల దృష్టికి వచ్చినా పట్టించుకోవడంలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. కొంత మంది వ్యక్తులు లగేజీని భద్రపరుస్తామంటూ ఒక్కో బ్యాగ్‌కు రూ.30 నుంచి రూ. 50 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ అధికారులు వెంటనే స్పందించి లగేజీ భద్రపరిచేందుకు చర్యలు చేపట్టి, ప్రైవేట్‌ వ్యక్తులను నియంత్రించాలని కోరుతున్నారు.

టైరు పగిలి కారు బోల్తా



బిడ్డ మృతదేహాన్ని ఎత్తుకొని రోదిస్తున్న తల్లి



ప్రమాదంలో బోల్తా పడిన కారు

- 9 నెలల బాలుడు మృతి, ఇద్దరు మహిళలకు గాయాలు
- హైదరాబాద్‌ నుంచి నాందేడ్‌కు వెళ్తుండగా ఘటన

వట్‌పల్లి(అందోల్‌): కారు పల్టీ కొట్టిన ఘటనలో 9 నెలల బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన అందోల్‌ మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌ నుంచి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆదివారం నాందేడ్‌లో జరిగే ఫంక్షన్‌కు కారులో వెళ్తున్నారు. నాందేడ్‌, అకోలా జాతీయ రహదారిపై వెళ్తుండగా అందోల్‌ మండల పరిధి డాకూరు–ఎర్రారం గ్రామ శివారులోకి రాగానే వారి కారు టైరు పగిలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి పల్టీకొట్టడంతో అందులో ఉన్న 9 నెలల బాలుడు విరాట్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు మహిళలకు గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో ఇద్దరు క్షతగాత్రులను సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులను సంప్రదించగా తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

బిడ్డ మృతదేహంతో తల్లి రోదన

ప్రమాదం జరిగిన వెంటనే తనకు తగిలిన గాయాలను లెక్క చేయకుండా కుమారుడి కోసం అటు ఇటు వెతికిన తల్లి చివరకు జీవచ్ఛవంలా పడి ఉన్న కొడుకును చూసి రోదించడం అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎంపీ బీబీపాటిల్‌ తన కారును నిలిపి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సహాయక చర్యలకు ఆదేశించారు.

పామాయిల్‌, జామ తోటలు దహనం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మద్దూరు(హుస్నాబాద్‌): గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారు 30 ఎకరాల పామాయిల్‌, జామతోటలు దహనమయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు ముస్త్యాల గ్రామాల శివారులో గల గ్యాస్‌ ఏజెన్సీ సమీపంలో మహ్మద్‌ ముస్తాక్‌ అజహర్‌ అనే రైతుకు 5 ఎకరాల పామాయిల్‌ తోట ఉంది. అలాగే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి సుమారు 25 ఎకరాల జామ తోట ఉంది. ఈ తోటలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. అటుగా వెళ్తున్న ఏఎస్‌ఐ జగదీశ్వర్‌ వెంటనే స్పందించి కానిస్టేబుల్‌తో కలిసి మంటలను ఆపేందుకు ప్రయత్నించారు. హుస్నాబాద్‌ అగ్నిమాప కేంద్రానికి సమాచారం అందించగా సిబ్బంది మంటలార్పివేశారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

శేరిపల్లిలో గడ్డివాము దగ్ధం

చిన్నశంకరంపేట(మెదక్‌): గడ్డివాము దగ్ధమైన ఘటన నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రవి యాదవ్‌ అనే రైతు వ్యవసాయ పొలం వద్ద 250 మోపులతో గడ్డివాము ఏర్పాటు చేశాడు. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టడంతో గడ్డి మోపులు దగ్ధమయ్యాయని వాపోయాడు.

స్కూల్‌ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



అనంతమ్మ (ఫైల్‌)

పటాన్‌చెరుటౌన్‌: స్కూల్‌ బస్సు ఢీకొట్టడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహమ్మద్‌ కురుషిద్‌ అలీ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఐనోల్‌ గ్రామానికి చెందిన చాకలి అనంతమ్మ(72) శనివారం ఉదయం పాలు కొనేందుకు కిరాణా షాపునకు వెళ్తుంది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా ఓ స్కూల్‌ బస్సు రివర్స్‌ చేస్తూ వెనుకాల ఉన్న అనంతమ్మను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స కోసం పటాన్‌చెరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు చాకలి రాజేందర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.